తిరుమలగిరిలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ ఆధ్వర్యంలో కేసీఆర్ కాన్వాయ్‌కి స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

రైతన్నకు కేసీఆర్‌కు భరోసా

తిరుమలగిరి, మార్చి 31 : ఎండిన పంటలు పరిశీలించడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం తిరుమలగిరి తెలంగాణ చౌరస్తాకు చేరుకోగానే మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. రైతులు, ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తిరుమలగిరి తెలంగాణ చౌరస్తాకు చేరుకుని అధినేతకు అభివాదం చేశారు. కేసీఆర్ బస్సులో నుంచి అభివాదం చేస్తూ తుంగతుర్తి మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో ఎండిన వరి పంటలను పరిశీలించడానికి బయల్దేరారు.

తిరుమలగిరి మున్సిపాలిటీలోని ఈదుల పర్రెతండా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టు వద్ద కేసీఆర్ బస్సును, వెనుకాల కాన్వాయ్‌లోని కార్లను పోలీసులు తనిఖీ చేశారు.

నాగారం : సాగు నీరందక ఎండిన పంటలను పరిశీలించి రైతన్నల కన్నీళ్లను తుడిచి ధైర్యాన్ని నింపేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నాగారం మండలంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చారు.

సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామ సమీపంలో ఎండిన పొలాన్ని చూపుతున్న రైతులు

నాగారం : నాగారంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల

ఇఫ్తార్ విందులో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల

కోదాడ రూరల్, మార్చి 31 : ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల అన్నారు. ఆదివారం కోమరబండ 10వ వార్డులో మామిడి రామారావు దంపతులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మామిడి పద్మావతి, వంగవీటి రామారావు, జాన్‌మహ్మద్, మునీర్, అబ్దుల్, నాగూల్, రఫీ, సీతయ్య, కిట్టు, లక్ష్మీనారాయణ, గోపి, ముస్లింలు పాల్గొన్నారు.

సీతారామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా గ్రామంలో ప్రదర్శించిన సత్యహరిచంద్ర పద్య నాటకం

సత్య హరిచంద్ర పద్య నాటక ప్రదర్శన

పాలకవీడు, మార్చి 31 : మండల కేంద్రంలో సీతారామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం గణపతి పూజ, పుణ్యహవాచనం, గోపూజ, నవకళశ పూజ, జలాభిషేకం, ప్రభాతబలి కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు వేదపండితులు ములుగు శ్రీనివాసాచార్యులు, శివచరణ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో శ్రీరామ కళామండలి ఆధ్వర్యంలో సత్య హరిచంద్ర పద్య నాటకం ప్రదర్శించారు. సోమవారం గ్రామంలో ధ్వజస్తంభ శిఖర స్థాపన,

విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మహా అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రామాలయంలో ప్రతిష్ఠించనున్న సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు

నేడు సీతారాముల విగ్రహాల ఉరేగింపు

నేరేడుచర్ల, మార్చి 31 : నేరేడుచర్ల పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామాలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాల ఉరేగింపు సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ఊరేగింపులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమస్యల నిలయం తిరుమలగిరి మున్సిపాలిటీ

- అధికారుల పర్యవేక్షణ కరువు
- మూడు మున్సిపాలిటీలకు ఒక్కరే టౌన్ ప్లానింగ్ ఆఫీసర్
- పన్నులు వసూలు తప్ప కనీస సౌకర్యాలు నిల్
- సమస్యలు పరిష్కరించాలని ప్రజల వేడుకోలు

తిరుమలగిరిలోని 5 వార్డు ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు



డ్రైనేజీ లేక ఇండ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

తిరుమలగిరి, మార్చి 31 : తిరుమలగిరి మున్సిపాలిటీ సమస్యల నిలయంగా తయారైంది. కనీస సౌకర్యాల కల్పన లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీలో కనీసం 30 ఫీట్ల దారి ఉండాలనే నిబంధన ఉన్నది. లేనిపక్షంలో ఇండ్లు నిర్మించే వారు సెట్ బ్యాక్ కావాల్సి ఉన్నది. కానీ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో కొంతమంది సెట్ బ్యాక్ కాకుండానే ఇండ్లను నిర్మిస్తున్నారు. అలాగే ఇండ్ల నిర్మాణానికి దరఖాస్తులు చేసుకుని అనుమతులు రాకముందే నిర్మాణ పనులు చేపడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. వాస్తవానికి మున్సిపాలిటీ అధికారులు ఇచ్చిన పర్మిషన్ మ్యాప్ (కొలతల) ప్రకారం ఇండ్ల నిర్మాణం చేపట్టాలి. ఆ ప్రకారమే ఇంటి నిర్మాణం జరుగుతున్నదా లేదా పరిశీలించాలి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగినప్పుడు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే నామ మాత్రంగా పరిశీలించి వదిలేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సైతం ఇన్‌చార్జి కావడంతో పర్యవేక్షణ కరువైయింది. తిరుమలగిరి, సూర్యాపేట, మిర్యాలగూడ మున్సిపాలిటీలకు ఒక్కరే టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా కొనసాగుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

ఇంటి పన్నులు వసూలు చేసినప్పుడు కనీస సౌకర్యాలు డ్రైనేజీ కాల్వల నిర్మాణం, నల్లా కనెక్షన్, సీసీ రోడ్లు ఉండాలి. కానీ తిరుమలగిరి మున్సిపాలిటీలో సగం వార్డుల్లో ఇటువంటి సౌకర్యాలేవి కనిపించవు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించకపోతే జరిమానాతో సహా వసూలు చేస్తారు. కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, ఇదెక్కడి న్యాయమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో డ్రైనేజీ కాల్వలు లేక మురుగు నీరు ఇండ్ల మధ్య ప్రవహిస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజల మధ్య గొడవలు తలెత్తుతున్నాయి. అధికారులు తగు చర్యలు తీసుకుని కనీస సౌకర్యాలు సమకూర్చాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారం లేకుంటే కట్టడాలు నిలిపి వేస్తాం

నిబంధనల ప్రకారం నిర్మాణాలు లేకుంటే కట్టడాలు నిలిపి వేస్తాం. ఎవరైనా మున్సిపాలిటీ నిబంధనలు పాటించాల్సిందే. అనుమతులు పొందిన తర్వాతే ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలి. వీధులు చిన్నవిగా ఉంటే సెట్ బ్యాక్ కావాల్సిందే. నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తే మా సిబ్బంది వెంటనే స్పందించి కట్టడాలు నిలిపివేస్తారు.

– సోమయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి, తిరుమలగిరి మున్సిపాలిటీ

చివ్వెంల : దురాజ్‌పల్లి బేతస్థ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న బిషప్ దుర్గం ప్రభాకర్

కోదాడ రూరల్ : నయానగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మానవాళి పాప పరిహారం కోసం ఏసుక్రీస్తు సిలువపై బలియాగం చేసి తిరిగి లేచిన మూడో రోజును క్రైస్తవులు ఈస్టర్ వేడుకగా జరుపుకుంటారు.

– నేరేడుచర్ల, మార్చి 31

ఆత్మకూర్.ఎస్ : పాతర్లపహాడ్ బేతస్థ ప్రార్థన మందిరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నేరేడుచర్ల : దిర్శించర్ల బాప్టిస్ట్ చర్చిలో ఈస్టర్ వేడుకలను నిర్వహిస్తున్న క్రైస్తవులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయంలో ఈస్టర్ వేడుకలో పాల్గొన్న క్రైస్తవులు

'మైహోం'లో ఘనంగా లక్ష కుంకుమార్చన

స్వామి వారికి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న పరిశ్రమ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు

మేళ్లచెర్వు, మార్చి 31 : స్థానిక మైహోం ఇండస్ట్రీస్ ఆవరణలో కొలువై ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం లక్ష కుంకుమార్చన, పారాయణం, నిత్య హోమం, ఎదుర్కోలు మహోత్సవం, హనుమద్వాహన సేవ కార్యక్రమాలను అహోబిల జీయర్‌స్వామి పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవం త్రిదండి చిన జీయర్‌స్వామి సమక్షంలో సోమవారం జరుగనున్నది. కార్యక్రమంలో పరిశ్రమ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు–శ్రీకుమారి దంపతులు, మునగాల రామ్మోహన్‌రావు–అరుణ, ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు, ఉద్యోగులు, కార్మికులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు లింగయ్య మృతి

హుజూర్‌నగర్, మార్చి 31 : సీపీఐ పార్టీ సీనియర్ నాయకుడు, హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన లింగయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, లింగయ్య సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు జడ శ్రీనివాస్, యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, జక్కుల రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

సూర్యాపేట రూరల్, మార్చి 31 : చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఈ ఘటన మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన చిలుక నాగరాజు కుమార్తె సాయి రిధి ఆరుబయట ఆడుకుంటుండగా కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గాయాలపాలైన బాలికను కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఇటీవల అదే కాలనీకి చెందిన చందుపట్ల కృష్ణ కుమార్తెపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల బెడదను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ బహూకరణ

ఆత్మకూర్.ఎస్, మార్చి 31 : పాతర్లపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996–97 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన కాకి అనంతరెడ్డి అకాల మరణం చెందారు. అతడి జ్ఞాపకార్థం తోటి స్నేహితులతో పాటు అనంతరెడ్డి తండ్రి సత్తిరెడ్డి గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ బాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో లింగ ప్రసాద్, పవన్, శ్రీకాంత్, ఉపేందర్, గోపాల్, వీరస్వామి పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామ పంచాయతీకి బహూకరిస్తున్న స్నేహితులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, మార్చి 31 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సూర్యాపేట బాస్కెట్ బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడా పోటీలను రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం క్రీడలతోనే పెంపొందుతుందన్నారు.

పోటీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది జట్లు పాల్గొన్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఫారూఖ్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెలుగు వెంకన్న, షఫీఉల్లా, నాయకులు గట్టు శ్రీనివాస్, ఎడ్ల వీరమల్లుయాదవ్, తండు శ్రీనివాస్, సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారులు గిరి, మంత్రి శ్రీనివాస్, బాచి, ప్రవీణ్, రాజేశ్, కార్తీక్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ

నేరేడుచర్ల : టైలర్‌కు గొడుగు పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల, మార్చి 31 : నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో దుకాణాల ఎదుట ఎండలో కూర్చోని టైలర్ వృత్తి నిర్వహిస్తున్న మైబెల్లి, శంకర్‌కు ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నీడ నిచ్చే పెద్ద గొడుగులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ ఎడవెల్లి సత్యనారాయణరెడ్డి, మాజీ చైర్మన్లు బట్టు మధు, సుంకరి క్రాంతికుమార్, కందిబండ శ్రీనివాస్‌రావు, కార్యదర్శి రామస్వామి పాల్గొన్నారు.

వెలిదండలో..

గరిడేపల్లి : మండలంలోని వెలిదండ గ్రామానికి చెందిన ములకలపల్లి భిక్షం చెప్పులు కుట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. లయన్స్ క్లబ్ నేరేడుచర్ల సహకారంతో భిక్షంకు గొడుగు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, సభ్యులు రాయిరాల శౌరి, ముకలపల్లి సైదులు, రేగంటి శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు తొలగింపు

కోదాడ రూరల్, మార్చి 31 : పట్టణ పరిధి కోమరబండ గ్రామ శివారులోని వై జంక్షన్ సమీపంలో గల ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడుతున్నారనే వార్తకు స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ భూమిలో ఇది ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవంటూ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కాగా దుండగులు శనివారం రాత్రి ఆ బోర్డును తొలగించారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును తొలగించిన దుండగులు

రైస్ మిల్లు నుంచి వచ్చే దుమ్మును అరికట్టాలని రాస్తారోకో

రాస్తారోకో చేస్తున్న రాఘవేంద్ర కాలనీ వాసులు

నేరేడుచర్ల, మార్చి 31 : నేరేడుచర్ల పట్టణంలోని రాఘవేంద్ర రైస్ మిల్లు నుంచి వచ్చే దుమ్ము, దూళిని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సమీప నివాసులు నేరేడుచర్ల–జాన్‌పహాడ్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మిల్లు నుంచి వచ్చే దుమ్ము, దూళి, పొగతో పాటు దుర్భరమైన వాసనతో ఉండలేక పోతున్నామని, తెల్లవారేసరికి ఇంటి పరిసరాలు బూడిదతో నిండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం వీడి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకారపు వెంకటేశ్వర్లు, మాస్ లైన్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్, జిల్లా కమిటీ సభ్యుడు వాస పల్లయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకుడు వాస కరుణాకర్ పాల్గొన్నారు.